క్లుప్తంగా

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



కరపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: మార్చి 13న జరుగుసున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో వివిధ విభాగాల్లోని ఉద్యోగులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. సమితి నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, కాశిరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

పుట్లూరు: బాలాపురం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు మండల మీట్

యాడికి: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఊరు దేవర

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో మంగళవారం పెద్దమ్మ, సుంకులమ్మ ఊరు దేవరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కుబడి ఉన్న వారు పెద్దమ్మ, సుంకులమ్మ తల్లికి బోనాలను మేళ తాళాలతో ఊరేగింపుగా ఆలయం వరకూ వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి వేకువజాము నుంచి అభిషేకం, ఆకుపూజ, మహామంగళ హారతి, బిల్వార్చన, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పొట్టేళ్లను బలిచ్చి బంధుమిత్రులకు విందు భోజనాలను ఏర్పాటు చేశారు.

1 నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

యల్లనూరు: ప్రతి నెలా డీలర్లు 1 నుంచి రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రోజూ డీలర్లు 150 మంది కార్డుదారులకు తప్పనిసరిగా సరుకులు అందించాలన్నారు.

సింథటిక్ మ్యాట్స్ దగ్ధం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరురోడ్ ప్రశాంతినగర్‌లో స్పైక్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన సింథటిక్ మ్యాట్స్ స్టాక్ పాయింట్‌లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి స్టాక్‌పాయింట్‌లో నిల్వ ఉంచిన టెన్నిస్ కోర్టు తయారీకి వినియోగించే సింథటిక్ మ్యాట్స్, రబ్బర్, ఫోమ్, తదితర వస్తువులు కాలిపోయాయి. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్ల సమాచారం హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారి లింగమయ్య పర్యవేక్షణలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఘటనలో దాదాపు రూ.2 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు శ్రీనివాసన్ వాపోయాడు.

అర్హులకు భూ పంపిణీ చేయాలి

గార్లదిన్నె: మండలంలో అర్హులకు భూపంపిణీ చేయాలని సీపీఎం నాయకులు కోరారు.మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కోటంకలో 243 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్న నిరుపేదలందరికి భూపంపిణీ చేయాలన్నారు. అనంతరం ఎస్ఐ సాగర్ అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య



అరుణ్ (ఫైల్)

నార్పల: తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నార్పలలోని ఉయ్యాలకుంట కాలనీకి చెందిన అంకన్న, మల్లీశ్వరి దంపతుల కుమారుడు అరుణ్ (19), స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో చదువుకోకుండా అల్లరిగా తిరుగుతుండడంతో మంగళవారం తండ్రి మందలించాడు. పరీక్షలు దగ్గరపడుతున్నాయని, బుద్ధిగా చదువుకుని పాస్ కావాలంటూ హితవు పలికారు. దీంతో మనస్తాపం చెందిన అరుణ్.. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అడుగడుగునా నీరాజనం

- ముచ్చుకోట నుంచి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రజా సంక్షేమయాత్ర ప్రారంభం
- వెల్లువలా తరలివచ్చిన జనం



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు



జేసీ వర్గీయులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోటలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం ప్రారంభించిన ప్రజా సంక్షేమ యాత్రకు ప్రజలు అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. వందలాది మంది ప్రజలు యాత్రకు సంఘీభావం తెలిపారు. తొలిరోజు ముచ్చుకోట, వరదాయపల్లి, అమ్మలదిన్నె మీదుగా జె.కొత్తపల్లి వరకూ యాత్ర కొనసాగింది. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు దారి వెంబడి పూల వర్షం కురిపిస్తూ ఆహ్వానం పలికారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు ముచ్చుకోట, చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టుల్లో నీరులేక బంగారాన్ని తాకట్టు పెట్టి బోర్లు వేయించినా ఫలితం లేకుండా పోయేదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక సమృద్ధిగా వర్షాలు కురవడంతో డ్యాంలలో పుష్కలంగా నీరు చేరడంతోపాటు భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రైతులు పంటలు పండించుకుని సుభిక్షంగా ఉన్నారన్నారు. ముచ్చుకోట, వరదాయపల్లి, అమ్మలదిన్నె, జె.కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతన్నలు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. యాడికి, పెద్దవడుగూరు, తాడిపత్రి మండలాలకు చెందిన పలువురు నాయకులు పాదయాతకు సంఘీబావం తెలిపారు.కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, నాయకులు రవిప్రసాద్ రెడ్డి, కోఆప్సన్ సభ్యుడు హాజీవలి, ఎంపీటీసీ మల్లేశ్వరి,అమర్‌నాథ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి, సర్పంచు వెంకటరాముడు, వెంకటనారాయణ, లక్ష్మన్న, వెంకటేశు, హుసేన్ పీరా, అమ్మలదిన్నె రామచంద్రరెడ్డి, సర్పంచు రాగిపిండి గౌతమి, శివశంకర్ రెడ్డి, జె.కొత్తపల్లి రాజశేఖర్ నాయుడు,సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేసీ వర్గీయులు వైఎస్సార్‌సీపీలో చేరిక

నామనాంకపల్లి గ్రామానికి చెందిన జేసీ ప్రధాన అనుచరుడు రఘునాథరెడ్డి మంగళవారం ముచ్చుకోటలో నిర్వహించిన ప్రజా సంక్షేమయాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, రాఘవరెడ్డి, లక్ష్మీనారాయణ, చాగల్లు రఘునాథరెడ్డి, తాడిపత్రికి చెందిన భరత్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో 15 మంది వైఎస్సార్‌సీపీ తీర్థంపుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

3న తాతార్యారూఢ స్వామి తిరునాల

గార్లదిన్నె: మర్తాడులో ఈనెల 3 నుంచి మూడు రోజులు తాతార్యారూఢ స్వామి తిరునాల ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఏటా ఫాల్గుణ శుద్ధ ద్వాదశి రోజున తాతార్యారూఢ స్వామి తిరునాల నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 3వ తేదీ ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 4న సూర్యోదయాత్పూర్వం, గంగపూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం, రాత్రి 10 గంటలకు స్వామి రథోత్సవం, 5న పరుష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుత్తి: గుత్తి , గుత్తి ఆర్ఎస్‌లలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ మంగళవారం తెలిపారు. 33 కేవీ, 220 కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతు దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి

- మంత్రి ఉషశ్రీ చరణ్



మాట్లాడుతున్న జిల్లా మంత్రి ఉషశ్రీ చరణ్

తాడిపత్రి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికలను సెమీ ఫైనల్‌గా భావించి వైఎస్సార్ సీపీ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర శిశు సంక్షేమ మంత్రి ఉషశ్రీ చరణ్ వైఎస్సార్ సీపీ శ్రేణులు, గృహసారథులు, కన్వీనర్లకు పిలుపునిచ్చారు. స్థానిక భగత్‌సింగ్‌నగర్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికలపై యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి నాయకులు, గృహసారథులు, కన్వీనర్ల ప్రత్యేక సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ మంగమ్మ , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీ మెజార్టీ లక్ష్యంగా పని చేయాలని సూచించారు. సీఎం జగన్ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కుల,మత, రాజకీయం భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిసున్నారన్నారు. అయితే దీన్ని ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేష్ పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారన్నారు. సీఎంగా చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ఒక హామీలను విస్మరించారని గుర్తు చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీకి అధికారాన్ని ప్రజలు పట్టంగట్టారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ స్థలాల్లో చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ రోడ్ షోలు, పాదయాత్రలు నిర్వహిస్తూ అబద్ధాలతో అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాడిపత్రిలో టీడీపీ నాయకులు దౌర్జన్య రాజకీయాలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ మాట మీద నిలబడేతత్వం వైఎస్ కుటుంబానికి చెల్లునన్నారు. తనకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంఆర్‌సీ రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి, నాయకులు రామశేఖర్, కేశవరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్.భవాని

గుంతకల్లుటౌన్: వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని అధికారులను ఆదేశించారు. మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎస్ఎస్.ట్యాంక్ వద్దనున్న ఫిల్టర్‌బెడ్స్ మోటార్ పంప్‌సెట్లకు సంబంధించిన ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్, లేత్ వర్క్స్, ఫిల్టర్‌బెడ్ల నిర్వహణకై సాధారణ నిధుల నుంచి రూ.4.90 లక్షలు, పైప్‌లైన్ల లీకేజీలు, వాల్వ్‌ల మరమ్మతుకు గానూ మరో రూ.4.90 లక్షల నిధుల మంజూరుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే కసాపురం రోడ్ మారుతినగర్ వద్ద సెంట్రల్ లైటింగ్ వైరింగ్, ఇతర మరమ్మతుకు రూ.2 లక్షలు, ఎస్ఎస్.ట్యాంకులో 10 హెచ్‌పీ హారిజాంటల్ స్ప్లిట్ కేసింగ్ పంప్‌సెట్, 15 హెచ్‌పీ పంప్‌సెట్ల కొనుగోలుకు రూ.4.95 లక్షల నిధుల మంజూరుకు కౌన్సిల్ అంగీకారం తెలిపింది. ఐదునెలల పాటు పట్టణంలోని చెట్లకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు అవసరమైన రూ.9.22 లక్షల నిధుల మంజూరు చేస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

52,581 మందికి వైఎస్సార్ రైతు భరోసా



కొరివిపల్లి ఆర్బీకేలో సీఎం వైఎస్ జగన్ సభను వీక్షిస్తున్న రైతులు

శింగనమల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ రైతు భరోసా(పీఎం కిసాన్) కింద ఏటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.13,500 నగదు రైతులకు అందిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగవ ఏట మూడో విడత కింద రూ.2,000లను రైతుల ఖాతాలోకి జమ చేశారు. శింగనమల నియోజకవర్గంలో 52,491 మంది రైతులు, 90 మంది కౌలు రైతులు, మొత్తం 52,581 మంది రైతులకు రూ.10,85,32,500 వారి ఖాతాల్లోకి జమ చేశారు. పుట్లూరు మండలంలో 8,329 మంది, నార్పల 9253 మంది, గార్లదిన్నె 8,983 మంది, శింగనమల 9152 మంది, యల్లనూరు 8,304 మంది, బుక్కరాయసముద్రం మండలంలో 8,560 మంది రైతుల ఖాతాల్లోకి నగదు జమైంది. ఆయా ఆర్బీకేల్లో రైతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను వీక్షించారు.

క్షయ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

యాడికి: క్షయ బాధితులకు ఫయాజ్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలు అందజేయటం అభినందనీయమని యాడికి వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని 30 మంది క్షయ బాధితులకు ఫయాజ్ సేవా ట్రస్ట్ సభ్యులు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాజశేఖర్, గురు ప్రసాద్, షాషావలి, బషీర్, యాడికి జామియా మసీదు ముతవల్లి షాషావలి ఫజుల్ భాష, ఫరూక్ పాల్గొన్నారు.

లైన్‌మెన్‌గా కృష్ణ సేవలు అమోఘం

పామిడి: లైన్‌మెన్ కృష్ణ విద్యుత్ శాఖలో అందించిన సేవలు అమోఘమని ఏఈ మధుసూదన్ పేర్కొన్నారు. లైన్‌మెన్ కృష్ణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను విద్యుత్ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉండగా అంబేడ్కర్ నగర్ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని సీవీ మంజుల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయడంతో ఆమెను ఘనంగా సత్కరించారు. స్కూల్ కమిటీ చైర్మన్ నల్లమ్మ, ఉపాధ్యాయులు, బీవీ రమణ, సుంకప్ప, వివేకానంద, నాగిరెడ్డి, జాకీర్‌హుసేన్, మల్లికార్జున, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు అభినందనలు

గుంతకల్లు రూరల్: అకడమిక్ రైటింగ్ ఫర్ సైంటిఫిక్ అప్లికేషన్ అనే అంశంపై జర్నల్స్‌ను ప్రచురించిన ఎస్ఎస్‌జీఎస్ కళాశాల అధ్యాపకులను ప్రిన్సిపాల్ పీ.గోపాల్ అభినందించారు. బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ శంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో కేస్ రైటింగ్, టీచింగ్ అండ్ పబ్లిషింగ్ అనే అంశంపై ప్యానల్ చర్చలో పాల్గొని ప్రతిభ కనబరచిన అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ సుభాషిణి, శ్రావణి, మహేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ పీ.గోపాల్ అభినందించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుంతకల్లు రూరల్: జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ మహేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మహేష్ మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించడంతోపాటు వాటిని ఏవిధంగా నివారించాలనే విషయాలను తెలియజేశారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు

యల్లనూరు: పెద్ద మల్లేపల్లి గ్రామ సమీపంలోని దర్గా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. చిలమకూరు గ్రామానికి చెందిన సూరీ, శివలక్ష్మి దంపతులు పని నిమిత్తం మంగళవారం ఉదయం తాడిపత్రికి ఆటోలో బయల్దేరారు. ఆటో దర్గా సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో శివలక్ష్మి మూడు కాలి వేళ్లు తెగిపోయాయి. సూరి ముక్కులో నుంచి తీవ్ర రక్తస్రావం అవడంతో స్థానికులు వారిని 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు కొలువులు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. లూమెన్ టెక్నాలజీస్ వారు ఇటీవల కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారని, ఇందులో సీఎస్ఈ విభాగానికి చెందిన ఉదయేశ్వర్, మధుసూధన్‌రెడ్డి, మణిదీప్, ఈసీఈ విభాగానికి చెందిన సాయి చందన, అత్యంత ప్రతిభ కనబరిచి ట్రైనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారన్నారు. వీరు వార్షిక వేతనం 7.4 లక్షలు పొందుతారన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి అభినందించారు.

సజావుగా టెండర్, వేలం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ వివిధ పనులకు నిర్వహించిన వేలం, టెండర్ ప్రక్రియ సజావుగా జరిగింది. ఆలయ ఈఓ దొడ్డ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ధనుంజయ వివిధ రకాల పనులకు మంగళవారం సీల్డు టెండర్‌తోపాటు, బహిరంగ వేలం పాట నిర్వహించారు. కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కును కసాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి రూ.16.50 లక్షలకు సొంతం చేసుకున్నాడు. వాహనాల పార్కింగ్ టెండర్‌ను కసాపురం గ్రామానికి చెందిన హరిశ్చంద్ర రూ.5.75 లక్షలకు, చాపలు, బెడ్‌షీట్స్ అద్దె ప్రాతిపదికన సప్లయ్ చేసే హక్కును కసాపురం గ్రామానికి చెందిన గోపాల్ రూ.4.45 లక్షలకు, సెల్‌ఫోన్స్ భద్రపరిచే టెండర్‌ను కసాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు రూ.4.60 లక్షలకు దక్కించుకున్నాడు. మిగిలిన పనులకు టెండరుదారులు లేక పోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం యల్లమ్మగుట్ట తండాకు చెందిన సోమ్లానాయక్ బసినేపల్లి గ్రామ సమీపంలో నాటుసారా తరలిస్తుండగా సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 40 లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ అలీ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

శింగనమల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చిన్నజలాపురం గ్రామానికి చెందిన ఆదెప్ప(40) గత నాలుగు రోజుల రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు వైద్యుల సూచనల మేరకు బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి



రామకృష్ణ(ఫైల్)

నార్పల: ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు..మండల కేంద్రంలోని మసీదుకట్ట కాలనీకి చెందిన రైతు రామకృష్ణ(51) పంటల సాగుతోపాటు, కుటుంబ అవసరాలకు దాదాపు రూ.12 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవరెడ్డి తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మోహన్‌నాయుడు అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. గ్రామ సమీపంలోని కల్లంలో గడ్డివామికి మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. కాగా గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే కాలిపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వెంకటప్రసాద్ పరిశీలించారు.

బెరాకా ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీ(19వ వార్డు)లో మంగళవారం బెరాకా ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ , కౌన్సిలర్ కప్పల బండ సుచరిత, చర్చి పాస్టర్‌తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పుట్లూరు: ఎల్లుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత లగినేని శేఖర్ తండ్రి సూర్యుడు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి గ్రామానికి చేరుకుని సూర్యుడు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం లగినేని శేఖర్‌ను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్ : కార్పెంటర్ కుటుంబానికి కార్పెంటర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. గన్నేవారిపల్లి కాలనీకి చెందిన కార్పెంటర్ సాయి చైతన్య పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న అసోసియేషన్ రాష్ట్ర అధికారి ప్రతినిధి నబీరసూల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరాచారి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మంగళవారం మృతుడి కుటుంబానికి రూ.33 వేల నగదు అందజేశారు.

ప్రకటన

నా క్లైయిదారురాలు అయిన **బోయ నల్లమ్మ** భర్త లేట్ తపాల్ రామాంజనేయులు, మర్తాడు గ్రామం, గార్లదిన్నె మండలంలో కాపురం ఉంటూ, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజరుగా MPR Dam Site Post Office నందు పనిచేయుచున్నది. ఈమె ఆధార్ కార్డులో కె. రాధమ్మ గా ఆధార్ నందు నమోదు అయినది. అయిన ఆమె అసలు పేరు బోయ నల్లమ్మ ఆమె యొక్క SSC Marks List లో వున్నదని మరియు ఆమె పేరు బోయ నల్లమ్మ అని తెలుపుచున్నాము.

యస్. బాల సుబ్బయ్య, అడ్వకేట్, అనంతపురము. సెల్: 9393725919

విద్యార్థుల్లో ఆలోచనా శక్తి వెలికితీయాలి



తాడిపత్రి టౌన్: ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎంఈఓ నాగరాజు, ఉపాధ్యాయులు

తాడిపత్రి టౌన్: విద్యార్థుల్లో ఆలోచనా శక్తి వెలికి తీయాలని ఎంఈఓ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాసపురంలోని సుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ ప్రారంభించారు. నంద్యాల రోడ్డులోని సూర్య స్కూలు, సీబీరోడ్డులోని గౌతమి మోడల్ స్కూలు, విజయనగర్ కాలనీలోని పద్మవాణి స్కూలు, జయనగర్ కాలనీలోని ప్రసాద్ స్కూలు, కాల్వగడ్డ వీధిలోని శ్రీ చైతన్య స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు.

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. హెచ్ఎం సుబహాన్, ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు, శామ్యూల్, నాగమణి, శేషాద్రి, శ్రీనివాసరెడ్డి, ఎస్తర్ రాణి, చంద్ర కళ, భరత్ భూషణ్ వాటిని తిలకించారు.

యాడికి: సర్ సీవీ రామన్ సేవలు మరువలేనివని కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల, మారుతి పేర్కొన్నారు. మంగళవారం వేములపాడు వద్ద గల కేజీబీవీ, రాయలచెరువు సమీపంలోని మోడల్ స్కూల్‌లో జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు.

గుంతకల్లు రూరల్: విద్యార్థి దశ నుంచే ప్రయోగాలు, ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని తహసీల్దార్ రాము సూచించారు. మంగళవారం స్థానిక డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను పరిశీలించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న కానిస్టేబుళ్లు ఇస్మాయిల్, మహబూబ్ బాషా, వీరేష్‌ను సత్కరించారు. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్, హెచ్ఎం ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయొచ్చని ఎంఈఓ రాముడు పేర్కొన్నాడు. మంగళవారం స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ హైస్కూల్ లో జాతీయ విద్యా వైజ్ఞానిక దినోత్సవం నిర్వహించారు. ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్ఎం నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: వెంకటాపురం, రోటరీపురం, బీకేఎస్‌లో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్తమ నమూనా తయారు చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.